క్లుప్తంగా

ఎమ్మెల్యేకు వినతి


వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

దమ్మపేట: మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. మండలంలోని దమ్మపేట ఎంపీడీఓ కార్యాలయం వెనుక భాగంలో ఉన్న ఖాళీ స్థలంలో గుడిసెల్లో నివాసం ఉంటున్న మహిళలు గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జారేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వారి ఆవాసాల దగ్గర తాగునీరు, సీసీ రోడ్లు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలను కల్పించాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి, సమస్యలను పరిష్కరించాలని సూచించారు. నాయకులు సుంకిపాక ధర్మ, బత్తుల సాయి, లక్ష్మీనారాయణ, తిరుపతమ్మ, శేష కుమారి పాల్గొన్నారు.

సన్మానం


టీపీసీసీ ప్రధాన కార్యదర్శులను సన్మానించిన పొదెం వీరయ్య తదితరులు

భద్రాచలంటౌన్: పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య క్యాంపు కార్యాలయంలో ఏఐసీసీ ద్వారా నూతనంగా నియమితులైన టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నల్లపు దుర్గా ప్రసాద్, మోతుకురి ధర్మారావు, నాగ సీతారాములను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పొదెం వీరయ్య వారికి శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. ప్రజల ఆకాంక్షలకనుగుణంగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

అటవీ భూముల సమస్యలు పరిష్కరించాలి

చర్ల: మండలంలోని చినమిడిసిలేరు గ్రామాలో గిరిజనులు ఎదుర్కొంటున్న అటవీ భూముల సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతూ తెలంగాణా అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వీరయ్యకు మండలంలోని చినమిడిసిలేరుకు చెందిన గిరిజనులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు భద్రాచలంలోని క్యాంపు కార్యాలయంలో పొదెంను కలిసి ఏళ్ల తరబడిగా సాగు చేసుకుంటున్న భూముల వ్యవహారంలో అటవీ అధికారులు పెడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వారికి ఆయన హామీ ఇచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నేడు (శనివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతున్నట్లు ట్రాన్స్‌కో ఏఈఈ సంతోష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు వినాయకపురం, నారాయణపురం, గంగారం సబ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి 10 వరకు సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

దమ్మపేట : మందలపల్లి సబ్‌స్టేషన్ 33 కేవీ విద్యుత్ లైన్‌లో మరమ్మతుల కారణంగా మండలంలోని మందలపల్లి, గట్టుగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ వెంకటరత్నం తెలిపారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 వరకు మందలపల్లి, గట్టుగూడెం సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

కరకగూడెం: మండల 11 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతులు దృష్ట్యా శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 వరకు మండలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కరకగూడెం విద్యుత్ శాఖ సబ్ ఇంజనీర్ రాజశేఖర్ తెలిపారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ


నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న మహేష్

పినపాక: మండల పరిధిలోని దుబ్బగుంపు ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం జానంపేట మాజీ సర్పంచ్ నోట్ బుక్స్, పెన్స్, బ్యాగులు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పటేల్ శీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రయాణించాలంటే అవస్థ..

అస్తవ్యస్తంగా చింతిర్యాల రహదారి
- కాలినడకన వెళ్లాలన్నా కష్టమే..
- ఇబ్బంది పడుతున్న మూడు పంచాయతీల ప్రజలు


అధ్వానంగా ఉన్న చింతిర్యాల రహదారి

అశ్వాపురం: మండల పరిధిలోని చింతిర్యాలక్రాస్ రోడ్డు నుండి చింతిర్యాల గ్రామం వరకు రహదారి గుంతలమయమై అస్తవ్యస్తంగా ఉండి రహదారిపై ప్రయాణించేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ రహదారిపై చింతిర్యాల కాలనీ, చింతిర్యాల, సంద్రలబోడు గ్రామ పంచాయతీల ప్రజలు మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తున్నారు. రోడ్డు పూర్తిగా దెబ్బతిని ద్విచక్రవాహనం వెళ్లడానికి కూడా నానా అవస్థలు పడుతున్నారు. మూడు పంచాయతీల ప్రజలు నిత్యం మండల కేంద్రానికి, ఇతర ఊర్లకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై కాలినడకన ప్రయాణించాలన్నా కష్టంగా ఉంది.

ఇసుక లారీలతో ధ్వంసం..

గతంలో చింతిర్యాలలో ఇసుక రీచ్ నిర్వహించారు. గిరిజన సొసైటీకి ఇసుక రీచ్ నిర్వహణ బాధ్యత అప్పగించారు. గిరిజన సొసైటీ వారు ఓ కాంట్రాక్టర్‌కు బాధ్యతలు ఇవ్వగా ఆ కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పెద్దఎత్తున లారీలతో ఇసుక రవాణా చేయగా లారీలతో రోడ్డు ధ్వంసం అయింది. రోడ్డు అధ్వానంగా మారుతోందని ఎన్నో సార్లు ఇసుక లారీలను గ్రామస్తులు అడ్డుకున్నారు. రోడ్డు నిర్మాణంపై గ్రామస్తులు మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యేకు విన్నవించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని మూడు పంచాయతీల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు అధ్వానంగా మారింది



గతంలో ఇసుక లారీలు తిరిగి రహదారి పూర్తిగా పాడైంది. రహదారి అధ్వానంగా ఉండటంతో మండల కేంద్రానికి రావాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నో ఏళ్లగా రహదారి సమస్యతో ఇబ్బంది పడుతున్నాం.
– పుల్లారెడ్డి, చింతిర్యాల

రహదారి నిర్మించాలి



చింతిర్యాల క్రాస్ రోడ్డు నుండి చింతిర్యాల వరకు రహదారి గుంతలమయమై ప్రయాణం ఇబ్బందిగా ఉంది. మండల కేంద్రానికి రావాలంటే అవస్థలు పడుతున్నాం. ఇప్పటికైనా స్పందించి రహదారి వెంటనే నిర్మించాలి.
– కుంజా రామారావు, సంద్రలబోడు

ఎరువులు తగ్గించి భూసారం పెంచుకోవాలి


దమ్మపేట: మాట్లాడుతున్న శాస్త్రవేత్త కృష్ణ తేజ


చంద్రుగొండ: మాట్లాడుతున్న నవీన్‌కుమార్

చంద్రుగొండ : రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి, రైతులు భూసారం పెంచుకోవాలని కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.నవీన్‌కుమార్, డాక్టర్ శ్రీనివాసరావు సూచించారు. 'రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో శుక్రవారం సదస్సు నిర్వహించారు. భూసార పరీక్షలు చేయించుకుని వాటికి అనుగుణంగా పంటల సేద్యంతోపాటు ఎరువుల వాడకం చేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు రైతులు చెట్లను పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఓ వినయ్‌కుమార్, ఏఈఓలు శ్రీనివాసరావు, సాయిభాను, అరుణ పాల్గొన్నారు.

దమ్మపేట: వ్యవసాయ భూముల భూసార పరీక్ష చేయు విధానంపై పూసుకుంట రైతులకు, అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. మండలంలోని పూసుకుంట గ్రామంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించగా కొండరెడ్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు కృష్ణ తేజ, పావని అటవీ ప్రాంతంలో ఉన్న కొద్దిపాటి వనరులతోనే, కొండ రెడ్లు చేస్తున్న వ్యవసాయం తీరును ప్రశంసించారు. అధికారులు, కార్యదర్శి, కొండ రెడ్లు తదితరులు పాల్గొన్నారు.

బోగస్ కుల ధ్రువపత్రాలపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న సత్యనారాయణ

చర్ల: మండలంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిపొందేందుకు కొందరు ఎస్టీ బోగస్ కుల ధ్రువపత్రాలు పొందుతున్నట్లుగా తెలుస్తోందని, అలాంటి వాటిపై రెవెన్యూ యంత్రాంగం దృష్టి సారించాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం చర్లలోని తహసీల్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కూడా మండలంలో దొడ్డి దారిన బోగస్ ఎస్టీ కుల ధ్రువపత్రాలు జారీ అయ్యాయని వాటిపై కూడా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేశామని, మళ్లీ తాజాగా కూడా ఈ తరహా సర్టిఫికెట్లు జారీ అవుతున్నట్లు తెలుస్తోందన్నారు. ఎస్టీ కుల ధ్రువపత్రాల జారీ సందర్భంగా గ్రామాల్లో పూర్తిస్థాయిలో విచారణ జరిపిన తరువాతనే ధ్రువపత్రాలను జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు ఇర్పా ప్రకాశ్, చర్ల మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం వరప్రసాద్, తెల్లం జగపతి, మండి కోటేశ్వరావు, శ్యామల రాజు ఉన్నారు.

21 నుంచి టీయూసీఐ రాష్ట్ర మహాసభలు

మణుగూరు టౌన్: ఈ నెల 21, 22న నిజామాబాద్‌లో జరిగే టీయూసీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు ఆర్. మధుసూదన్‌రెడ్డి కోరారు. శుక్రవారం కార్మికులతో కలిసి పోస్టర్లు ఆవిష్కరించారు. సింగరేణిలో వివిధ విభాగాలలో కరపత్రాలు పంచుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సంఘం సింగరేణి, కేజీబీవీ, పంచాయతీ, మున్సిపాలిటీ, ఆటో అండ్ మోటార్ వర్కర్స్, హోటల్స్ బీడీ వర్కర్లు, హమాలీ, మధ్యాహ్న భోజన వర్కర్లు, బిల్డింగ్ వర్కర్లు, విద్యుత్, ఆస్పత్రి వంటి రంగాలలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతూ వారి హక్కుల కోసం ఉద్యమిస్తుందన్నారు. అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జానయ్య తదితరులు ఉన్నారు.

సభను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న సలీం

అశ్వారావుపేటరూరల్: సీపీఐ మండల మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి ఎస్‌డీ.సలీం కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక పామాయిల్ ఫ్యాక్టరీ ఎదురుగా ఉన్న పార్టీ కార్యాలయంలో శనివారం సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు గన్నిన రామకృష్ణ, నూకవరపు విజయకాంత్ పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం


దుమ్ముగూడెం : అక్షరాభ్యాసం కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

దుమ్ముగూడెం : మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో బడిబాటలో భాగంగా శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. నూతనంగా చేరిన ఒకటవ తరగతి విద్యార్థులకు పాఠశాలలో రంగు రంగుల పువ్వులతో, ఆకుపచ్చ తోరణాలతో అలంకరించబడిన పాఠశాల ఆవరణంలో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, గ్రామస్తులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బొడ్డు నాగేశ్వరరావు, టి.హైమావతి, ఏఎస్‌ఎం దుర్గాదేవి, అంగన్‌వాడీ సిబ్బంది, భవిత సెంటర్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు టౌన్: మండలంలోని కట్టుమల్లారం గిరిజన సంక్షేమ పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం హెచ్‌ఎం పి.సత్యదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరహరి సుబ్బలక్ష్మి, రజిత, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్, చిన్నారుల తల్లిదండ్రులు ఉన్నారు.

మారిన విద్యుత్ అధికారుల నంబర్లు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం విద్యుత్ శాఖ అధికారుల ఫోన్ నంబర్లు మారినట్లు భద్రాచలం డీఈ జీవిన్‌కుమార్ శుక్రవారం తెలిపారు. సమస్యలు వస్తే డీఈ ఆపరేషన్ (భద్రాచలం) 8712486022, ఏఈ టెక్నికల్ (భద్రాచలం డివిజన్ కార్యాలయం) 8712486023, ఏఈ కమర్షియల్ 8712486024, ఎల్‌ఎంసీ 8712486025, ఏడీఈ ఓఎస్టీ 8712486026, ఏఈ ఆపరేషన్స్ (భద్రాచలం టౌన్) 8712486027, ఎఫ్‌ఎం 8712486028, సీనియర్ లైన్‌ఇన్‌స్పెక్టర్లు-1, 2 8712486029, 8712486030, లైన్ ఇన్‌స్పెక్టర్ -1, 2, 3, 4 (భద్రాచలం టౌన్) 8712486031, 8712486032, 8712486033, 8712486034, లైన్‌మెన్-1 8712486035, భద్రాచలం సబ్‌స్టేషన్ 8712486036, కొత్రాజులగుట్ట సబ్‌స్టేషన్ 8712486037, ఏఏఓ (ఈఆర్‌ఓ) (భద్రాచలం) 8712486073 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం


మాట్లాడుతున్న నాయకులు

మణుగూరు టౌన్: కార్మికుల సమస్యల పరిష్కారంలో ఐఎన్‌టీయూసీ ముందుంటుందని ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఏరియాలో కేసీహెచ్‌పీలో బ్రాంచి వైస్ ప్రెసిడెంట్ కృష్ణంరాజు అధ్యక్షతన జరిగిన ఫిట్ సమావేశంలో జనరల్ సెక్రటరీ అల్బర్ట్‌తో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం, ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి కనీస వేతనాల సలహా కమిటీ చైర్మన్ జనక్ ప్రసాద్ సారథ్యంలో అనునిత్యం కార్మిక సమస్యలపై పరిష్కరించడానికి కృషి చేస్తున్నామన్నారు. అనంతరం పలు సమస్యలు పరిష్కరించాలని కేసీహెచ్‌పీ డీజీఎం మదన్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్, కృష్ణంరాజు, ఫిట్ సెక్రటరీ శ్యాం వర్మ, అజిత్, రాజాబాబు, నాయకులు అబ్దుల్ రవూఫ్, బానోత్ కృష్ణ, మల్లికార్జున్, సంతోష్ చరణ్, జంపాల శ్రీనివాస్, చతరాజు, అశోక్, తెప్ప శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న యూసఫ్

ములకలపల్లి: మండపరిధిలోని జగన్నాథపురంలో ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) నిర్మించాలని సీపీఐ మండల కార్యదర్శి ఎండీ.యూసఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగన్నాథపురంలో అంతటి ఐలయ్య అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటు చేసిన గ్రామ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. జబ్బార్, చీరాల అప్పారావు, చావా కృష్ణ, అప్పారావు, మద్దెల పద్మ ఉన్నారు.

'అనర్హులకు ఇళ్లు'

పినపాక: మండలంలో పలు పంచాయతీల్లో అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారని సీపీఎం మండల కార్యదర్శి నిమ్మల వెంకన్న ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ వెంటనే అర్హులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు


బూర్గంపాడు: యూనిఫాం అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు

బూర్గంపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. పినపాక పట్టీనగర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బడిబాట కార్యక్రమంలో విద్యార్థులకు నోట్ బుక్స్, పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ ఆయన అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తుందన్నారు. అనంతరం జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడారు. భూ భారతి చట్టం రైతులకు వరమన్నారు. ధరణి పోర్టల్‌తో నష్టపోయిన రైతులకు భూ భారతి చట్టంతో న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శిరీష, ఎంపీడీఓ జమలారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రామ్‌నరేష్, ఎంఈఓ యదుసింహరాజు, ఉపాధ్యాయులు, రైతులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

అశ్వాపురం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డిని ఆయన నివాసంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పరామర్శించారు. నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, నాయకులు బూరెడ్డి వెంకటరెడ్డి, మొగిళ్ల వీరారెడ్డి, సోమిరెడ్డి, కృష్ణారెడ్డి, ఏకాంబరం, వీరయ్య, గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, ఎస్‌కే.ఖదీర్ ఉన్నారు.

డీఆర్ డిపోను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే వెంకట్రావు


దుమ్ముగూడెం: డిపోను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

దుమ్ముగూడెం: మారుమూల గిరిజన ప్రాంతంలో గిరిజనులకు అందుబాటులో ఉండాలని ఉద్దేశంతో డిఆర్‌డిపోను ఏర్పాటు చేశారని గ్రామస్తులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. ఈ మేరకు మండలంలోని చిన్న నల్లబల్లి గ్రామంలో గిరిజన ప్రాథమిక సహకార మార్కెటింగ్ సంఘం వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డీఆర్ డిపోను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ, నాయకులు లంకా శ్రీనివాసరావు, మట్టా శివాజీ, పిలక వెంకటరమణరెడ్డి, దర్శి సాంబశివరావు, కోడి చంటి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఎంకామ్ చదివి రెండు గోల్డ్ మెడల్స్ సాధించిన బానోత్ ప్రనూషను ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అభినందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జాన్ మిల్టన్, అధ్యాపకులు, విద్యార్థి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు పింఛన్ సదుపాయం కల్పించాలి

భద్రాచలంఅర్బన్: 1999 నుండి 2004 మధ్య కాలంలో విద్యుత్ సంస్థలో చేరిన ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే పింఛన్ సౌకర్యం కల్పించాలని రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యే, ఎంపీలకు తమ వినతిపత్రాలు సమర్పిస్తున్నారు. ఈ మేరకు విద్యుత్ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సంఘం (జేఏసీ) జిల్లా సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావును కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం డీఈ జీవన్ కుమార్, ఏడీఏ వేణు, కె.రాజారావు, 1104 యూనియన్ జిల్లా అధ్యక్షులు అశోక్, 327 యూనియన్ జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, సీఐటీయూ యూనియన్ ఎన్పీడీసీఎల్ కంపెనీ సెక్రటరీ వెంకటరాజు, ఉదయ్ రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంస్థను కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిది..


సమీక్ష సమావేశంలో జీఎం, అధికారులు

మణుగూరు టౌన్: సింగరేణి సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిదని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో ఉద్యోగుల రూల్ ఆఫ్ రిజర్వేషన్(ఆర్‌ఓఆర్) అమలు తీరుపై సమీక్ష నిర్వహించగా, ఆయన రిజర్వేషన్ ఆఫ్ చీఫ్ లైజన్ ఆఫీసర్ హోదాలో పాల్గొని మాట్లాడారు. సింగరేణి ఉద్యోగుల సంక్షేమానికి యాజమాన్యం ఎన్నో మంచి కార్యక్రమాలను అమలు చేస్తోందని, ఉద్యోగులు సంస్థ పురోగతికి ఉత్పత్తి లక్ష్య సాధనకు, అంకిత భావంతో సమష్టి కృషితో పనిచేయాలన్నారు. అనంతరం సివిల్, ఐఈడీ, పర్సనల్ విభాగాలలో 59డీ అమలుతీరును సమీక్షించారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్యాంసందర్, రమేశ్, సింగు శ్రీనివాస్, ప్రవీణ్, అంతోటి నాగేశ్వరరావు, రాజేశ్వర్, నర్సింహారావు, రావు, మల్లేష్, ఏరియా వైస్ ప్రెసిడెంట్ శనిగరపు కుమారస్వామి, దాట్ల సందీప్, వేణు, ప్రమోద్, క్రాంతికుమార్, ప్రవీణ్‌కుమార్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

హామీలు అమలుచేయాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మణుగూరు రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఆరుగ్యారంటీల్లో విద్యార్థులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీఆర్‌ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్ ఎదుట నిరసన చేపట్టి తహసీల్దార్ నరేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యువజన నాయకులు మాట్లాడుతూ... విద్యార్థినులకు స్కూటీలు, లాప్‌టాప్‌లు ఇవ్వాలని, పదో తరగతి నుండి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఇస్తామన్న నగదు ప్రోత్సాహకాలను వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. బోశెట్టి రవిప్రసాద్, గుర్రం సృజన్, రుద్ర వెంకట్, పద్దం శ్రీనివాస్, జక్కం రంజిత్ పాల్గొన్నారు.

17 నుండి గ్రామాల్లో క్యాంపులు

ములకలపల్లి: ఈనెల 17 నుండి 26 వరకు దర్తీ ఆబా జనాభాగి దారి అభియాన్ శ్యాచురేషన్ క్యాంపులు ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ గద్దె రేవతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు ఏర్పాటు చేస్తున్న ఈశిబిరాల్లో గిరిజనులకు కావాల్సిన 11 రకాల ధృవపత్రాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

అశ్వాపురం: మండలంలోని రెవెన్యూ గ్రామాల్లో ఈ నెల 17 నుంచి క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ముత్యాలరావు తెలిపారు. 17న గొందిగూడెం, 19న తుమ్మలచెరువు, 27న బట్టీలగుంపు, 28న వెంకటాపురంలో క్యాంపులు నిర్వహిస్తామన్నారు.

దోమల మందు పిచికారీ

మణుగూరు రూరల్ : మండలంలోని పలు వసతిగృహాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం దోమలమందు పిచికారీ చేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా మందు పిచికారీ చేసినట్లు పీహెచ్‌సీ డాక్టర్ నిశాంత్‌రావు తెలిపారు. ఎస్‌యూఓ వీరస్వామి, వైద్యసిబ్బంది రాంప్రసాద్, కృష్ణ, సుమ, విజయ, వార్డెన్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్మఒడిలా.. అంగన్‌వాడీ


గుండాల: ముత్తాపురంలో..


మణుగూరు రూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

గుండాల: ఆట పాటలతో విద్యనందించే అమ్మఒడి లాంటి అంగన్‌వాడీ కేంద్రానికి తమ పిల్లలను పంపించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పుష్ప అన్నారు. మండలంలోని ముత్తాపురం అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీలకు సంబంధించి వర్కుబుక్స్ ఉన్నాయని సూచించారు.

మణుగూరు రూరల్: మండలంలోని శివాజీనగర్ మణుగూరు-4 అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో అమ్మమాట- అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. శివాజీనగర్‌లో ర్యాలీ నిర్వహించి ఐదేళ్ల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని తల్లిదండ్రులను కోరారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాలు, అంకెలు వంటి వాటిని నేర్పించారు. మణుగూరు సీడీపీఓ జయలక్ష్మీ మాట్లాడుతూ... ఐదేళ్ల లోపు పిల్లలను అంగన్‌వాడీలకు పంపించాలన్నారు. సూపర్‌వైజర్ సుశీల, అంగన్‌వాడీ టీచర్లు కె.సుజాత, భద్రమ్మ, ఆయాలు శోభ, లక్ష్మీ ఉన్నారు.